
సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



పత్తి ధర రూ.6,625

పెద్దపల్లిరూరల్: వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.6,625 ధర నమోదైంది. కనిష్టంగా రూ.5,911, సరాసరి రూ.6,511గా నమోదైంది.



ఎన్టీపీసీ జీఎం బదిలీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు జనరల్ మేనేజర్ అనుపమ్ ముఖర్జీని ఝార్ఖండ్‌లోని పత్రాటు విద్యుత్ ఉత్పాదన నిగమ్ లిమిటెడ్‌కు బదిలీ అయ్యారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మెరుగైన విద్యాబోధన చేయాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

జూలపల్లి(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్(టీఎల్‌ఎం) పద్ధతిన కచ్చితంగా విద్యాబోధన చేయాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. కాచాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కిచెన్ గార్డెన్ పరిశీలించారు. నీటి సరఫరాకు రూ.35వేలు మంజూరు చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాధికారి మాధవి, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్, సర్పంచ్ ఎల్లయ్య, ఎంపీటీసీ శ్రీలత పాల్గొన్నారు.

సీఎంఆర్ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: రైస్‌మిల్లర్లు తమకు కేటాయించిన, పెండింగ్‌లోని సీఎంఆర్‌ను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. కలెక్టరేట్‌లో భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) డివిజనల్ మేనేజర్, రైస్‌మిల్లర్లు, జిల్లా అధికారులతో కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీపై సమీక్షించారు. ఎఫ్‌సీఐ బియ్యం డెలివరీ చేయడంలో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. ఈ వానాకాలం ధాన్యాన్ని త్వరగా సేకరించి ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని అన్నారు. రైతులకు సత్వరమే చెల్లింపులు జరిగేలా సహకరించాలని కోరారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికారి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో

పెద్దపల్లిరూరల్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారుడు మనోజ్ పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం మనోజ్‌ను ఎంఈవో సురేంద్రకుమార్, సీఆర్పీ వెంకటేశం అభినందించారు. ఈనెల 7న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన తాజ్ బేక్ హ్యామర్‌త్రో విభాగంలో కాంస్య పతకం సాధించాడు.

వాహనదారుల ఇబ్బందులు



బారులు తీరిన వాహనాలు

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట – బల్లార్షా సెక్షన్ల మధ్య ఓదెల రైల్వేస్టేషన్ సమీపంలోని లెవల్ క్రాసింగ్ వద్ద మంగళవారం వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఉదయం నుంచి పొగమంచు ఆవరించడం, చిరుజల్లులు కురవడంతో రైళ్ల రాకపోకల్లో జాప్యం జరిగింది. రైళ్ల వేగం తగ్గించడంతో ఆలస్యంగా నడిచాయి. దీంతో పొత్కపల్లి, కొలనూర్, ఓదెల రైల్వేస్టేషన్ల సమీపంలోని గేట్‌లు గంటల కొద్దీ మూసివేశారు. ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. ప్రయాణికులే కాదు.. డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



టపాసులు కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు

పెద్దపల్లిరూరల్: సీఎంగా రేవంత్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేయడంపై ఆ పార్టీ అభిమానులు, నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. జెండా కూడలి వద్ద నాయకులు ముడుసు సాంబిరెడ్డి, ఆడెపు వెంకటేశం, శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, నాయకులు జగదీశ్, మసూద్, విజయ్‌సింగ్, నర్సింగరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు. పెద్దకల్వలలో జరిగిన సంబురాల్లో నాయకులు పెగడ రమేశ్ యాదవ్, కారెంగల రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగం.. ఉపాధి..

- నిరుద్యోగ సమస్య పరిష్కారం లక్ష్యం
- కొత్త బొగ్గు గనుల ఏర్పాటు ప్రత్యామ్నాయం
- ప్రధాన సమస్యల ప్రస్తావనే ధ్యేయంగా ఎన్నికల ప్రచారం
- సర్వం సిద్ధం చేసుకుంటున్న కార్మిక యూనియన్లు
- సమాయత్తమవుతున్న మాతృ పార్టీల నేతలు
- ఆరేళ్ల తర్వాత బొగ్గు గనుల్లో ఎన్నికల సైరన్
- ఏడోదఫా ఎన్నికలకు యాజమాన్యం శ్రీకారం



గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల్లో సమ్మెలను నివారించాలనే లక్ష్యంతో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు అప్పటిప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలిసారి 1998 సెప్టెంబర్ 14న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. లెక్కకు మించిన కార్మిక సంఘాలు తమ ఉనికి కోసం తరచూ సమ్మె చేయడం, బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడడంతో ప్రభుత్వం, యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనకు వచ్చాయి.

సమ్మెలకు చెక్..

- కార్మికుల సమస్యలను గుర్తింపు సంఘం యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చే అవకాశం కల్పించడం, ఏరియాల వారీ సమస్యలపై ప్రాతినిధ్య సంఘంతో చర్చించడంతో సంస్థలో సమ్మెలు గణనీయంగా తగ్గాయి.
- ఇదే సమయంలో సంస్థలో సుమారు 1.20లక్షల మందికిపైగా కార్మికులు ఉండగా శరవేగంగా ప్రారంభమైన సంస్కరణలతో వారి సంఖ్య భారీగా తగ్గుతూ వస్తోంది.
- ప్రత్యామ్నాయంగా యాంత్రీకరణ వృద్ధి చెందుతూ పోతోంది.
- ప్రస్తుతం సింగరేణిలో 39,748మంది కార్మికులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

పెరుగుతున్న కాంట్రాక్టు కార్మికుల సంఖ్య..

సింగరేణిలో ఏటా పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఇదేక్రమంలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రస్తుతం సంస్థలో సుమారు 42వేల మంది పనిచేస్తుండగా, కాంట్రాక్టు కార్మికుల సంఖ్య 25వేలకుపైగా చేరిందని గణాంకాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈసంఖ్య పర్మినెంట్ కార్మికులతో సమానంగా ఉన్నా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని కార్మిక నాయకులు అభిప్రాయపడుతున్నారు.

మూడుసార్లు ఏఐటీయూసీ.. రెండుసార్లు టీబీజీకేఎస్..

- సుమారు 25ఏళ్ల నుంచి సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నారు.
- ఇందులో సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ మూడుసార్లు, బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ రెండుసార్లు విజయం సాధించాయి.
- ఒకసారి ఐఎన్‌టీయూసీ గెలిచింది. తొలుత రెండేళ్ల కాలపరిమితి ఉండగా.. ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ విజయం సాధించింది.
- ఆ తర్వాత రెండోసారి 2001 ఫిబ్రవరి 11న జరిగిన ఎన్నికల్లోనూ అదే యూనియన్ విజయ ఢంకా మోగించింది.
- మూడోసారి 2003 మే 9న జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ విజయం సాధించింది.
- ఇదే సమయంలో గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచారు.
- 2007 ఆగస్టు 10న జరిగిన నాలుగోసారి ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపొందగా, 2012 జూన్ 28న జరిగిన ఐదో దఫా ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకెఎస్) విజయం సాధించింది.
- 2017 అక్టోబర్ 5న జరిగిన ఎన్నికలో టీబీజీకేఎస్ రెండోసారి గెలిచింది.
- దీని కాలపరిమితి 2021లో ముగిసింది. ఆ వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉంది.
- అప్పుడు కోవిడ్ ప్రభావంతో ఆ ప్రక్రియకు తెరపడింది.
- అనేక అవాంతరాల తర్వాత ఈనెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

ఇప్పటిదాకా జరిగిన ఎన్నికల సమాచారం

ఏడాది	విజేత	కాలపరిమితి
09-09-1998	ఏఐటీయూసీ	రెండేళ్లు
19-02-2001	ఏఐటీయూసీ	రెండేళ్లు
14-05-2003	ఐఎన్‌టీయూసీ	నాలుగేళ్లు
09-08-2007	ఏఐటీయూసీ	నాలుగేళ్లు
28-06-2012	టీబీజీకేఎస్	నాలుగేళ్లు
05-10-2017	టీబీజీకేఎస్	నాలుగేళ్లు

కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే..

- భూగర్భ గనులు పెంచాలి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- 200 చదరపు గజాల సొంతింటి కోసం స్థలం కేటాయించాలి లేదా క్వార్టర్ పర్మినెంట్‌గా కేటాయించాలి
- ఆదాయపు పన్ను రద్దు చేయాలి
- పిల్లలకు సీబీఎస్‌ఈ విధానంలో విద్య అందించాలి
- కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలి
- హెల్త్ ఎమర్జెన్సీ రెఫరల్ ఆన్‌లైన్‌లో చేపట్టాలి
- అన్ని వ్యాధులకు సీపీఆర్‌ఎంఎస్ కార్డు వర్తింపజేయాలి
- ఆస్పత్రుల్లో వైద్య నిపుణులను నియమించాలి
- అధికారుల మాదిరిగా కార్మికులకు సీపీఆర్‌ఎంఎస్ రూ.25లక్షలకు పెంచాలి
- రిటైర్డ్ కార్మికులకు ఏరియా ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి
- కార్మిక వారసుల వయోపరిమితి 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంచాలి
- అధికారుల మాదిరిగా కార్మికులకు గ్రాట్యుటీ సీలింగ్ అమలు చేయాలి
- తీవ్రఅనారోగ్య సమస్యలున్న కార్మికులను మరోసారి మెడికల్ బోర్డుకు పంపించాలి

ఎన్నికల కిక్కు

- మూడు నెలలు – రూ.151 కోట్ల మద్యం విక్రయాలు



సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఎన్నికల సందర్భంగా మద్యం విక్రయాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగాయి. ఒకప్పుడు రెవెన్యూలో ఒక విభాగంగా ఉన్న ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి ఇప్పుడు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. రోజురోజుకూ పెరుగుతున్న మద్యం అమ్మకాలే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు.

ఆగస్టు 21 నుంచి జోరుగా..

- బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్ ఆగస్టు 21న తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు.
- దీంతో అన్ని రాజకీయ పార్టీల్లో ఎన్నికల సందడి మొదలైంది.
- సెప్టెంబర్ తొలివారం నుంచి అభ్యర్థులు, వివిధ వర్గాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు.
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రామగుండంలో అక్టోబర్ 1న నిర్వహించిన ప్రచార ఆశీర్వాద సభతో మొదలైన రాజకీయ సందడి, డిసెంబర్ 3న ఫలితాలు వచ్చేవరకూ జోరుగా కొనసాగింది.
- దీనికి అనుగుణంగానే మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.
- నోటిఫికేషన్ వెలువడడమే ఆలస్యం అన్నట్లుగా మద్యం అమ్మకాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.

77 వైన్స్ షాపులు.. 15 బార్లు..

జిల్లాలో 77 మద్యం దుకాణాలు, 15బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటి పరిధిలో మూడునెలల్లో విస్కీ, బ్రాందీ 1,40,977 కాటన్లు, బీర్లు 2,65,590 కాటన్లు అమ్ముడు పోయాయని అధికారులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.151కోట్ల వరకు ఉంటుందని వారు వివరించారు. అలాగే ఈ మూడు నెలల్లో బెల్ట్‌షాపులు, అక్రమంగా నిల్వచేసిన సుమారు 2,751లీటర్ల మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని 346 కేసులను 254మందిపై నమోదు చేశారు. రూ.3,06,76,675 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు.

టోకెన్ల ఆధారంగా పంపిణీ

- గతంలో ఎన్నికలకు ఒకరోజు ముందు ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేసేవారు.
- ఈసారి పోలీసులు, ఎక్సైజ్ అధికారుల నిఘా తీవ్రం కావడంతో గ్రామాల్లోని బెల్ట్‌షాపులు మూసివేశారు.
- మద్యం పంపిణీపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించారు.
- పోలింగ్ కేంద్రాలు, వార్డులు, గ్రామాల్లో కుల, యువజన, ఉద్యోగ సంఘాలకు మద్యంతో విందులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.
- పొద్దంతా ఎన్నికల ప్రచారం చేసిన ముఖ్యనాయకులు, అనుచరులకు నిత్యం మద్యంతో కూడి విందు ఇచ్చారు.
- దీంతో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి.
- కొన్నిచోట్ల దుకాణం పేరుచెప్పి పార్టీ కార్యకర్తలకు టోకెన్లు కూడా ఇచ్చారు.
- నాయకుల స్థాయిని బట్టి లిక్కర్ బ్రాండ్ పంపిణీ చేశారు.
- కొన్ని ప్రాంతాల్లో డబ్బుతోపాటు, ఓటర్లకు చౌకమద్యం అందజేశారు.
- గ్రామస్థాయిలో ప్రధాన అనుచరులు, చోటామోటా నేతలకు కాస్త మంచి బ్రాండ్ మద్యం అందుబాటులో ఉంచారు.

గతం కంటే తగ్గింది

గత ఎన్నికలతో పోల్చితే ఈసారి మద్యం అమ్మకాలు బాగా తగ్గాయి. జిల్లాలో గుడుంబాను నియంత్రణలోకి తీసుకొచ్చాం. దీనిద్వారా గుడుంబా విక్రయాలు తగ్గి మద్యం అమ్మకాలు పెరిగాయి తప్పితే ప్రత్యేకంగా విక్రయాల్లో వృద్ధి లేదు. నిరంతర తనిఖీలు, విక్రయాలపై నిఘా కూడా మద్యం ప్రభావం తగ్గించింది.
– మహిపాల్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి

సొంత భవనం నుంచే పాలన



మున్సిపల్ కార్యాలయం

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ అధికారులు అద్దె భవనం ఇటీవల ఖాళీ చేశారు. సొంత భవనం నిర్మాణం అసంపూర్తిగా ఉన్నా.. ఆగమేఘాలపై అందులోకే వచ్చి చేరారు. అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టడంతో అధికారులు ఇటీవల ఖాళీచేశారు. ప్రగతినగర్‌లోని అద్దె భవనంలోకి మారారు. ఆ భవనం ప్రధాన రోడ్డును ఆనుకుని ఉండడంతో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. ఇరుకుగా ఉండడంతో సందర్శకులకే కాకుండా అధికారులు, సిబ్బందికీ తిప్పలు తప్పడంలేదు. దీంతోపనులు అసంపూర్తిగా ఉన్నా.. సొంత భవనంలోకే అధికారులు, సిబ్బంది వచ్చి చేరారు. పైఅంతస్తుల్లో పనులు కొనసాగుతుండగా, కింది అంతస్తు నుంచి అధికారులు పాలన అందిస్తున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. పార్కింగ్ సమస్య, సందర్శకుల ఇబ్బందుల దృష్ట్యా ఆఫీసును సొంత భవనంలోకి తరలించినట్లు ఆయన వివరించారు.

‘హస్త’వాసి బాగుంది!

- ప్రభుత్వ వ్యతిరేకత, పోరాటాలతో 8 సీట్లు కైవసం
- బలంగా పని చేసిన సానుభూతి, 6 పథకాలు
- నిరాశపరిచిన హుజూరాబాద్, జగిత్యాల ఫలితాలు
- ఉత్సాహం నింపిన రాహుల్‌గాంధీ, రేవంత్, భట్టి పర్యటనలు
- నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయావకాశాలకు బీజేపీ గండి
- నిజమైన ‘సాక్షి’ కథనం



ఆరైనా ‘హస్తగతం’ కావాలి!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ నేతల హస్తవాసి బాగుంది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల్లో చేతిగుర్తు లీడర్లకు, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దక్కిన ఈ విజయం కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపింది. అయితే, ఇవన్నీ ఒక్క రోజులో జరిగినవి కావు. పకడ్బందీ ప్రణాళికతో ఈరోజు పటిష్ట స్థితికి చేరుకోగలిగింది.

13 నియోజకవర్గాల్లో మీటింగ్‌లు

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 8 సీట్లు కైవసం చేసుకుంది. ప్రచారంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, అనుసరించిన వ్యూహాలు, 6 గ్యారంటీ పథకాలను పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లగలగడం, అగ్రనేతల పర్యటనలు కేడర్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరిట ఆదిలాబాద్ నుంచి మధిర వరకు చేపట్టిన పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల మీదుగా సాగింది. దీనికి జాతీయ నాయకులు హాజరవడం కేడర్‌లో ఐక్యతను పెంచింది. తర్వాత రేవంత్‌రెడ్డి వరుస మీటింగ్‌లు, రాహుల్ గాంధీ పర్యటనలు మరింత జోష్ పెంచాయి.

ప్రభుత్వ వ్యతిరేకత, ధరణి సమస్యలు

ఇదే సమయంలో టీఎస్‌పీఎస్సీ కుంభకోణం, 317 జీవో అమలుతో వచ్చిన వ్యతిరేకత, ధరణిలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. వీటిని ఎండగట్టడంలో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు సక్సెస్ అయ్యారు. అంతేకాకుండా టీఎస్‌పీఎస్సీ నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నవారు, సూత్రధారులు, పాత్రధారులు సైతం ఉమ్మడి జిల్లాకు చెందినవారు కావడం ఇక్కడ కారు పార్టీ ప్రతిష్ట మసకబారేలా చేసింది. దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు పథకాల అమలులో అవినీతి, అనుచరులకే ఇస్తామంటూ నేతల బహిరంగ వ్యాఖ్యలు హస్తం పార్టీకి కలిసివచ్చాయి. ఎన్నికల మేనిఫెస్టో రూపొందించాక.. 6 గ్యారంటీ పథకాలకు విస్తృత ప్రచారం, బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనన్న నినాదాన్ని జనాల్లోకి తీసుకెళ్లడంలో కిందిస్థాయి కేడర్ సఫలీకృతులయ్యారు. వీటికి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాయకులపై ప్రజలకు ఉన్న సానుభూతి జత కలిసింది. ఫలితంగా మంచి మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయ తీరాలకు చేరారు.

దెబ్బతీసిన బీజేపీ, ఇండిపెండెంట్లు..

వాస్తవానికి ఈసారి ఎన్నికల్లో బీజేపీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపడం పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి చేటు చేసింది. దీనికి స్వతంత్రులు సైతం తోడయ్యారు. ఒక్క సిరిసిల్ల మినహా కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, హుజూరాబాద్‌లో బీజేపీ బలం, చీలిన ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేశాయి. బీఆర్‌ఎస్ గెలిచిన 5 స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు ఉన్నారు. జగిత్యాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్లలో జువ్వాడి నర్సింగరావు, హుజూరాబాద్‌లో ఒడితెల ప్రణవ్ ఓటమికి కమలం పార్టీ అభ్యర్థులు చీల్చిన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లే కారణమని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచి, క్లీన్ స్వీప్ చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎక్కడా బీజేపీ బలమైన అభ్యర్థులను నిలబెట్టలేకపోయిందని, ఇందుకు ఆ పార్టీకి వచ్చిన ఓట్లే నిదర్శనమని అంటున్నారు.

నిజమైన సాక్షి కథనం...

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న ఆది శ్రీనివాస్–వేములవాడ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్–ధర్మపురి, మక్కాన్ సింగ్–రామగుండం, శ్రీధర్‌బాబు–మంథని, జీవన్‌రెడ్డి–జగిత్యాల, పొన్నం ప్రభాకర్–హుస్నాబాద్ గెలుస్తారని, ఆ దిశగా పార్టీ ప్రణాళికతో సాగుతోందని ‘ఆరైనా హస్తగతం కావాలి’ అన్న శీర్షికన గత ఆగస్టు 26న ‘సాక్షి’ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అదే నిజమైంది. అయితే, హోరాహోరీ పోరులో జగిత్యాల సీటు కాంగ్రెస్ చేజారగా, అదనంగా పెద్దపల్లి, మానకొండూరు, చొప్పదండి స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం గమనార్హం. మాజీ ఎంపీ వివేక్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారన్న విషయాన్నీ ఇదే కథనంలో ప్రస్తావించిన విషయం విదితమే.

బీఆర్‌ఎస్ గెలిచినచోట బీజేపీకి వచ్చిన ఓట్లు

కరీంనగర్:	
గంగుల కమలాకర్(బీఆర్‌ఎస్)	92,179
బండి సంజయ్ (బీజేపీ)	89,016
హుజూరాబాద్:	
పాడి కౌశిక్‌రెడ్డి(బీఆర్‌ఎస్)	80,333
ఈటల రాజేందర్ (బీజేపీ)	63,460
జగిత్యాల :	
సంజయ్‌కుమార్(బీఆర్‌ఎస్)	70,243
బోగ శ్రావణి(బీజేపీ)	42,138
కోరుట్ల:	
కల్వకుంట్ల సంజయ్(బీఆర్‌ఎస్)	72115
ధర్మపురి అర్వింద్ (బీజేపీ)	61,810
సిరిసిల్ల:	
కేటీఆర్ (బీఆర్‌ఎస్)	88,761
రాణీ రుద్రమదేవి (బీజేపీ)	18,328

పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు వచ్చిన ఓట్లు

రామగుండం :	
రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్	92,227
కందుల సంధ్యారాణి (బీజేపీ)	12,966
పెద్దపల్లి :	
చింతకుంట విజయరమణారావు	1,18,888
దుగ్యాల ప్రదీప్‌కుమార్ (బీజేపీ)	6,312
మంథని :	
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	1,03,822
చందుపట్ల సునీల్‌రెడ్డి (బీజేపీ)	5,680

మధు రాజీనామాను వారించిన కేసీఆర్

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, ఆయన సతీమణి, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వారించారు. రాజీనామా ఆలోచనను విరమింజేశారు. మంగళవారం రాత్రి వారిని తమ నివాసానికి పిలిపించుకొని నచ్చజెప్పారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని ఈనెల7న (గురువారం) లెక్కించనున్నట్లు ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పంచాయతీ పాలకులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా గురువారం ఉదయం 10.30గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

- సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కోల్‌సిటీ(రామగుండం): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ కోరారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సిమ్స్ ఆధ్వర్యంలో మెడికోలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కాలేజీ నుంచి ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, మెడికల్ స్టూడెంట్స్ జీజీహెచ్ వరకు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దన్నారు. వైద్య బృందం అరుణ, శ్రీదేవి, అశోక్, అప్పారావు, అలేఖ్య, సజహాన్, ఏఆర్‌టీ, ఐసీటీసీ సిబ్బంది, మెడికోలు పాల్గొన్నారు.





పెద్దపల్లిలో కురుస్తున్న వర్షం

వెంటాడుతున్న తుపాను భయం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. తుపాను ప్రభావంతో కురుస్తున్న జల్లులతో పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కానీ, ధాన్యంలో తేమ వస్తుందని, కోతకు వచ్చిన వరిపైరుకు తెగుళ్లు ఆశిస్తాయని, పత్తి రంగు మారుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లపై రైతులు టార్పాలిన్లు కప్పుతూ కనిపించారు. కల్లాల వద్ద కోసి ఎండబెట్టిన వడ్లకు తేమరాకుండా చర్యలు తీసుకుంటున్నారు.
– పెద్దపల్లిరూరల్/మంథని/ఎలిగేడు/సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



వర్షంలో సైకిల్‌పై సవారీ



మంథనిలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

క్లుప్తంగా

ప్రజాతీర్పు శిరసావహిస్తున్నా
● మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తననివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీలు గంట రాములు, వంగల తిరుపతిరెడ్డి, ఎంపీపీ బాలాజీరావుతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలను వేలాదిమంది అర్హులకు అందించగలిగానన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై శ్రద్ధ చూపాలని సూచించారు. హామీల అమలులో విఫలమైతే ప్రజాపోరాటాలకు సిద్ధపడతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడడం సరికాదని ఓదెల జెడ్పీటీసీ గంట రాములు అన్నారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేసినా కాంగ్రెస్‌దే విజయం
• కాంగ్రెస్ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్


మాట్లాడుతున్న మహేశ్

రామగుండం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లను బీఆర్ఎస్ పార్టీ ఎన్నో రకాలుగా ప్రలోభాలకు గురిచేసిందని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆరోపించారు. అయినా, వారు కాంగ్రెస్‌కు ఓటు వేసి, మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. మంగళవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని ఎమ్మెల్యే చెప్పారన్నారు. ప్రతీ గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి పెంద్రు హన్మాన్‌రెడ్డి, నాయకులున్నారు.

వ్యక్తి ఆత్మహత్య
కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన భూతం రాయలింగు(48) ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. రాయలింగు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఆరు నెలలుగా మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అతిగా మద్యం సేవించి, ఆ మత్తులో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం అతని భార్య లక్ష్మి లేచి చూడగా మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..
తిమ్మాపూర్(మానకొండూర్): భార్య కాపురానికి రావడం లేదని మన్నెంపల్లికి చెందిన నాంపల్లి రాజు(29) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజు భార్య కవిత కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు తిరిగి రావాలని కోరినా రాకపోవడంతో అతను మనస్తాపం చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి జగన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎన్నికల సేన 2.0

● ముందస్తు కార్యాచరణతో యంత్రాంగం సఫలం
● చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం
● సకల సౌకర్యాలు.. ప్రత్యేక కేంద్రాల్లో పెరిగిన పోలింగ్‌శాతం

పోలింగ్ శాతమిలా	
ఉమ్మడి జిల్లా	76.00
కరీంనగర్	75.64
పెద్దపల్లి	75.62
జగిత్యాల	76.12
రాజన్న సిరిసిల్ల	75.92



నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం	
కరీంనగర్	62.93
మానకొండూరు	81.33
హుజూరాబాద్	80.62
చొప్పదండి	77.68
కోరుట్ల	75.62
జగిత్యాల	74.12
ధర్మపురి	79.01
సిరిసిల్ల	73.42
వేములవాడ	78.43
మంథని	79.14
రామగుండం	68.74
పెద్దపల్లి	81.40

కరీంనగర్ అర్బన్: తెలంగాణ శాసన సమరంలో అభ్యర్థుల జయాపజయాలు పక్కనబెడితే ఉద్యోగుల పాత్ర అమోఘం. రాత్రనక, పగలనక శ్రమించిన తీరు అభినందనీయం. ప్రకటన వెలువడిన దరిమిలా జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ముందస్తు కార్యాచరణ ఎన్నికల మెరుగైన నిర్వహణకు దోహదపడ్డాయి. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు ఎన్నికల్లో భాగస్వాములు కాగా పక్కా ప్రణాళికతో బేష్ అనిపించారు. ఉమ్మడి జిల్లాలో చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా నిర్వహించారు. పలు చోట్ల ఓట్లు గల్లంతవడం.. పోల్ చీటీలు రాకపోవడం కొంత ఆందోళన కలిగించింది. వెరసి 2023 ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

కలెక్టర్ల పాత్ర అభినందనీయం
ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కలెక్టర్ల పాత్ర అభినందనీయం. కలెక్టర్లు పమేలా సత్పతి(కరీంనగర్), అనురాగ్ జయంతి(రాజన్నసిరిసిల్ల), ముజమ్మిలాఖాన్(పెద్దపల్లి), షేక్ యాస్మిన్ బాషా(జగిత్యాల)లు ఎన్నికల నిర్వహణలో సఫలమయ్యారు. ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలను కిందిస్థాయి సిబ్బంది వరకు చేరవేరవేయడంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో వీరికి అయా జిల్లాల సీపీలు, ఎస్పీలు సహకారం అందించారు. ఫలితంగా ఎన్నికలలో కీలకఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియగా ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించారు.

నిర్వహణలో ప్రధాన శాఖలు ఇవే..
ఎన్నికల విజయవంతం అయ్యాయంటే రెవెన్యూ పాత్ర కీలకం కాగా దీనికితోడు సుమారు 20శాఖలకు పైగా ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించారు. ఓటరు నమోదు మొదలుకుని పోలింగ్ పూర్తయి.. ఓట్ల లెక్కింపు వరకు కీలక భూమిక పోషించారు. యువత ఓటెత్తగా పట్టణాల్లోనూ పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌శాతం పెరిగింది. రెవెన్యూ, విద్యాశాఖ, కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, ఎక్సైజ్, మహిళా సంక్షేమం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, ఆర్టీసీ, సర్వే లాండ్ రికార్డ్స్, సహకార ఆడిట్ విభాగం, వీటి పారుదల, రోడ్లు, భవనాలు, ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, వైద్య ఆరోగ్యశాఖ, యువజన సంక్షేమ, ఇంటర్మీడియట్, తదితర శాఖలు, ఆయా కళాశాలల ఉద్యోగులు ఎన్నికల సేనలో ఉన్నారు.

గురువులు కీలకులే
ఎన్నికల ప్రక్రియ అంతా ఒక ఎత్తయితే పోలింగ్ మరో ఎత్తు. ఆ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం. గత నెల 29, 30 తేదీల్లో వారు నిద్రలేని రాత్రులు గడిపి ఎన్నికల సమరాన్ని గట్టెక్కించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,185 మంది ఉపాధ్యాయులు ఈ క్రతువులో పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం
పాలిటెక్నిక్ విద్యార్థులు, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, మండల, జిల్లా కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు పోలింగ్ చిత్రీకరణ పనులు అప్పజెప్పారు. వారూ కేంద్రాలకు వెళ్లి ఉదయం నుంచి పోలింగ్ ముగిసే వరకు వీడియో చిత్రీకరణ చేసి ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం అందించడంలో కీలక భూమిక పోషించారు. ఈ ప్రక్రియలో ఉమ్మడిజిల్లావ్యాప్తంగా 2,500 మంది యువత సాంకేతిక జోడింపులో పాత్ర పోషించారు. బీఎల్వోలు, ఆశాకార్యకర్తలు, ఎఎస్ఎంలు ఓటరు జాబితా రూపకల్పనలో ఓటర్లకు పోల్ చీటీలు పంచి వారిని పోలింగ్ కేంద్రానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేల సిబ్బంది రెండునెలలకు పైగా తీరిక లేకుండా క్షేత్రస్థాయిలో పని చేశారు.

ప్రత్యేక సేవల్లో సంక్షేమ, డీఆర్డీఏ
ఓటుహక్కు ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్ సౌకర్యం కల్పించగా జిల్లా సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, పరిశ్రమలశాఖ విశేష కృషి చేసింది. ఇంటింటికీ వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునేలా శ్రమించారు. నడిచేవారు, ఆరోగ్యంగా ఉన్న వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి వారిని ఇంటి వద్దకు చేర్చడంలో వలంటీర్ల కృషి అభినందనీయం. అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలతో ఓటు వేయించడంలో చొరవ చూపారు.

పటిష్ట భద్రత
ఒకప్పుడు మావోయిస్టు, జనశక్తి ప్రభావిత ప్రాంతంగా ముద్రపడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు ఆ ప్రభావం అంతగా లేకపోయినా పోలింగ్ రోజున ఎలాంటి సమస్య తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అభిషేక్ మహంతి(కరీంనగర్ సీపీ) అఖిల్ మహాజన్(రాజన్నసిరిసిల్ల ఎస్పీ) రెమో రాజేశ్వరి(పెద్దపల్లి సీపీ), సన్‌ప్రీత్‌సింగ్(జగిత్యాల ఎస్పీ)ల సమక్షంలో జిల్లా పోలీసులతో పాటు బలగాలు, పారామిలటరీ సైనికులు బందోబస్తు నిర్వహించారు.

వైద్య సేవల మెరుగుకు సీపీడీ దోహదం

• డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి
• ఆన్‌లైన్ ద్వారా సిమ్స్‌లో సీఎంఈ కార్యక్రమం ప్రారంభం


వైద్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

కోల్‌సిటీ(రామగుండం): వైద్య సేవలను మరింత మెరుగుపర్చడానికి గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) నిర్వహించిన నిరంతర వృత్తి వికాస కార్యక్రమం (సీపీడీ) వైద్యులకు దోహదపడుతుందని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ) డాక్టర్ రమేశ్ రెడ్డి అన్నారు. కాలేజీ యాజమాన్యం తొలిసారి సిమ్స్ ప్రొఫెసర్లతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన వైద్యులకు మంగళవారం సిమ్స్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూళన, మెరుగైన వైద్య సేవలపై కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమం నిర్వహించింది. దీన్ని డాక్టర్ రమేశ్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమాన్ని వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ రమాకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, కళాశాల నిర్వాహకులను అభినందించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబింద్ సింగ్ మాట్లాడుతూ.. సీఎంఈ కార్యక్రమానికి కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు, జీజీహెచ్ వైద్యులు, గోదావరిఖనిలోని పలువురు ప్రైవేట్ డాక్టర్లతోపాటు కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి 150 మంది వైద్యులు హాజరైనట్లు తెలిపారు. వీరికి తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ద్వారా రెండు క్రెడిట్ అవర్స్ సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూళనకు చేసిన పరిశోధనల్లో ఇప్పటివరకు వచ్చిన మెరుగైన ఫలితాలు, భవిష్యత్తు పోకడలు, వైద్య సేవలు మెరుగుపడిన తీరు తదితర అంశాలపై వైద్య నిపుణులు వివరించారు. దేశవ్యాప్తంగా ఐదుగురు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులను వాడటం ద్వారా వ్యాధిని జయించారని తెలిపారు. అనంతరం ఏఆర్‌టీ విభాగం వైద్యులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రొఫెసర్లు అరుణ, అశోక్, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, అనంతబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ
కథలాపూర్: మండలకేంద్రంలోని శివారులో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు మంగళవారం తెలిపారు. కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలోని పది మోటార్ల కాపర్ వైరును చోరీ చేశారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'స్థానిక' సమరానికి సన్నద్ధమవుదాం


మాట్లాడుతున్న ఉష, పక్కన నాయకులు

• ఎన్నికల్లో గెలుపోటములు సహజమే
• బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: రానున్న స్థానిక సంస్థల సమరానికి సన్నద్ధమవుదామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు నియోజకవర్గ ప్రజలు 10 వేల పైచిలుకు ఓట్లు వేసి, అండగా నిలిచారని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, అధైర్యపడాల్సిన పనిలేదని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుదామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెద్దపల్లిలో బస్ డిపో, బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాను నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజు, జెడ్పీటీసీ సభ్యుడు బండారి రామ్మూర్తి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈర్ల కొమురయ్య, కౌన్సిలర్లు రాజమహంత, భాగ్యలక్ష్మి, నాయకులు సురేందర్ సన్నీ, సతీశ్, దుర్గయ్య, రియాజ్ తదితరులున్నారు.

సింగరేణి కార్మికులకు స్వీట్లు పంపిణీ


కార్మికులకు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కాంగ్రెస్ పార్టీ రామగుండం ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజ్‌ఠాకూర్, మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు గెలిచిన సందర్భంగా ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 సీహెచ్‌పీలో ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. సింగరేణి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి, భారీ మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోఆర్జీ–3 వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కాలనీ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు కిషన్ నాయక్, పోచం, రవి, రాజయ్య, గోపాల్, రాజేశం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


పోశంను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మేకల పోశం అలియాస్ గ్యాస్ పోశం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. పోశంకు రాజీవ్‌నగర్‌కే చెందిన మహేశ్‌తో పాత గొడవలున్నాయి. ఈ నెల 3న ఇద్దరూ గొడవ పడ్డారు. మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోశం మంగళవారం కోర్టు ఆవరణలోకి వచ్చి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా అక్కడే విధుల్లో ఉన్న ఎస్బీసీసీ ఠాణా కానిస్టేబుల్ పురుషోత్తం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ అభి, కోర్టు హోంగార్డు నాగేశ్వర్‌రావులు అడ్డుకున్నారు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి, బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


మౌనికను అభినందిస్తున్న టీచర్లు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక సంతోష్‌నగర్ ఏరియాలోని కేజీబీవీ పాలకుర్తి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.మౌనిక ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వరూప తెలిపారు. ఈ నెల 4న అండర్–17 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి 1.5 కిలోమీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు వరంగల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని స్పెషల్ ఆఫీసర్‌తోపాటు పీఈటీ రాజేశ్వరి, టీచర్లు మంగళవారం అభినందించారు.

'ఎన్నికల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం'

మంథని: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి, మంథని డివిజన్ మీడియా కన్వీనర్ ఇనుముల సతీశ్ ఆరోపించారు. సోమవారం ఆయన మంథనిలో మాట్లాడారు. 1,000 నుంచి 1,500 వందల మంది ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాలైన తాగునీరు, దివ్యాంగులకు ర్యాంపు, ట్రై సైకిల్ వంటివి ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో ఓటర్లు అసౌకర్యానికి గురయ్యారని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేశారన్నారు. బీఆర్ఎస్‌కు వత్తాసు పలుకుతూ ఎన్నికలకు రెండు రోజుల ముందే పోలింగ్ బూత్‌లలో భద్రత ఏర్పాట్లు చేయకుండా ఒక్కో పోలీసును నియమించారని తెలిపారు. పదేళ్ల అరాచకానికి వత్తాసు పలికిన అధికారులు కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే ఇక్కడి నుంచి వెళ్లిపోవడం మంచిదని సూచించారు. మంథని నుంచి ఐదోసారి అసెంబ్లీకి ఎన్నికైన శ్రీధర్‌బాబుకు అభినందనలు తెలిపారు. జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు, నాయకులు ఐలి శ్రీనివాస్, గొల్లపల్లి శ్రీనివాస్, ఆరెల్లి కిరణ్, జనగామ సడవలి, ఊదరి శంకర్, ఆరిఫ్ తదితరులున్నారు.

'పెంచాల'తో ఐఎన్‌టీయూసీకి సంబంధం లేదు


సమావేశమైన నాయకులు

గోదావరిఖని: పెంచాల తిరుపతితో ఐఎన్‌టీయూసీకి సంబంధం లేదని ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు సదానందం అన్నారు. మంగళవారం గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌ల నాయకత్వంలో వేసిన కమిటీలకు గుర్తింపు ఉందని తెలిపారు. తిరుపతికి సంఘంలో సభ్యత్వం కూడా లేదని, కమిటీలు వేసే అర్హత లేదన్నారు. ఆయనతోపాటు కొందరు వ్యక్తులు కమిటీ పేరిట సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వంగ లక్ష్మీపతిగౌడ్, ఆరెపల్లి శ్రీనివాస్, సాగర్, జగన్మోహన్, గాదె సంపత్, నర్సయ్య, చారి, గణపతి, దామోదర్, చంద్రారెడ్డి, కుమారస్వామి, రాజయ్య తదితరులున్నారు.

టీబీజీకేఎస్‌కు 'జక్కుల' రాజీనామా


దామోదర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–3 ఏరియా, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) బ్రాంచి కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు జక్కుల దామోదర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 5 రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కోల్ బెల్ట్ ప్రాంతంలో ఒకరు కూడా గెలవలేకపోయారని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్సీ, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కవితకు పంపినట్లు తెలిపారు.

బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక



కరీంనగర్: 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన హైదరాబాద్‌లోని జెనెటిక్స్ భవన్‌లో జరిగింది. పారమిత పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి కె.ఋుగ్వేద్ ప్రదర్శించిన వెండర్స్ ఫ్రెండ్లీ వెజిటేబుల్ కార్ట్ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైంది. టీఎస్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ మారుపాక సతీశ్, ఐ.ఐ.సి.టి. పూర్వ సంచాలకులు కమల్, జెనెటిక్ విభాగం డైరెక్టర్ విజయలక్ష్మి, విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పి.మదన్‌మోహన్ చేతులమీదుగా ఋుగ్వేద్ ప్రశంసాపత్రం అందుకున్నాడు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కో–ఆరినేటర్ కేఎస్.అనంతాచార్య, గైడ్ టీచర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. డీఈవో జనార్దన్‌రావు విద్యార్థిని అభినందించారు.

'పది'లో మెరుగైన ఫలితాలే లక్ష్యం

• జనవరి 10వ తేదీలోగా సిలబస్ పూర్తవ్వాలి
• విద్యార్థులు ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజన
• ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు
• మార్చి 24 నుంచి పరీక్షలు



సుల్తానాబాద్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచి, ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేసేందుకు 'లక్ష్య'పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశారు. ఇందులో భాగంగానే ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ప్రత్యేక తరగతులు బోధించడం మూలంగానే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు

జిల్లాలో 299 పాఠశాలలు..
పెద్దపల్లి జిల్లాలో 216 ప్రభుత్వ, 83 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుత విద్యాసంవత్సరం 8,461 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏటా పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లా కొంత వెనకబడుతోంది. 2021–22 విద్యా సంవత్సరంలో ... మంది పరీక్షలు రాశారు. వీరిలో 70 శాతం మంది పాసయ్యారు. ఈసారి వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రతిరోజు గంట సమయం..
విద్యార్థులకు ప్రతీరోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాధ్యపడకపోతే డీఈవో అనుమతితో సాయంత్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. శీతాకాలం కావడంతో సాయంత్రం 5 గంటలకే సూర్యాస్తమయం అవుతోంది. ఈ నేపథ్యంలో జనవరి నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే పీజీ హెచ్ఎంలు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సుమారు 20 రోజులపాటు పాఠ్యాంశాల బోధనపై ప్రభావం చూపింది. ఎన్నికల కారణంగా టీచర్లను పోలింగ్ అధికారులుగా నియమించడంతో అనుకున్న సమయానికి సిలబస్ పూర్తవుతుందా అని తల్లిదండ్రులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు పూర్తవడంతో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులపై దృష్టిసారించే అవకాశం ఉంది.

జనవరి 10 వరకు ప్రణాళిక..
జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. ఏ–కేటగిరిలో విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పగానే అవగాహన చేసుకొని, చదవడం, రాయడం ద్వారా ఎక్కువ మార్కులు తీసుకురావడం, బీ–కేటగిరి విద్యార్థులు టీచర్లు చెప్పడంతోపాటు తోటి విద్యార్థులు చెప్పిన వాటిని అర్థం చేసుకొని, ముందుకు వెళ్లడం, సీ–కేటగిరి విద్యార్థులు టీచర్ల సహాయంతోనే చదివేలా చర్యలు తీసుకుంటున్నారు. జనవరి 10వ తేదీలోగా సిలబస్ పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మార్చి 24 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

ఉదయం టిఫిన్
పదోతరగతి విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇది దోహదపడుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంటున్నారు.

సిలబస్ పూర్తి చేయాలి
ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎన్నికల ప్రభావం వారిపై పడకుండా టీచర్లు సిలబస్ పూర్తి చేయాలి. ఈసారి జిల్లా నుంచి అత్యధిక ఉత్తీర్ణతా శాతం నమోదుకు కృషి చేయాలి.
– మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి